


మందకోడిగా..

ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబాటు

- జిల్లాలో మొత్తం బకాయిలు రూ.6.86 కోట్లు
- రూ.5.01 కోట్ల వసూలు, పెండింగ్‌లో రూ.1.85 కోట్లు
- 13 రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



మహబూబాబాద్ రూరల్, మార్చి17: ఇంటిపన్ను వసూళ్లలో జిల్లా వెనుకబడి ఉంది. మరో 13 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, 73 శాతం మాత్రమే ప్రజల నుంచి వసూలు అయ్యాయి. ఇంకా 27శాతం పన్నులను రాబట్టవలసి ఉంది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 18 మండలాలు ఉన్నాయి. 461 గ్రామ పంచాయతీలు ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బకాయిలు రూ. 6,86,19,668లగాను ఇప్పటి వరకు రూ.5,01,14,368 మాత్రమే వసూళ్లు చేశారు. ఇంకా రూ.1,85, 05,300లు పెండింగ్‌లో ఉన్నాయి. మరో పదమూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు అయ్యేనా..? అనే సందిగ్ధం నెలకొంది.

గ్రామాలు, తండాల్లో పంచాయతీల అభివృద్ధికి ఇంటి, నల్లా పన్నులతో ఎంతోకొంత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉన్నప్పటికి అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఏర్పడింది. గ్రామాల్లో పన్నుల వసూళ్ల రూపంలో వచ్చిన నగదును మౌళిక వసతులైన విద్యుత్ బకాయిలు, వీధిలైట్ల ఏర్పాటు, శానిటేషన్ కోసం ఉపయోగించుకునే అవకాశం ఉంది. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ ఉద్యోగులు చొరవచూపి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. జిల్లాలో అత్యధికంగా పన్నులు వసూలు చేసిన మండలాల్లో గంగారం, డోర్నకల్ మండలాలు ముందున్నాయి. అతితక్కువగా పనులు వసూలు చేసిన మండలాల్లో పెద్దవంగర 47 శాతంతో చిట్టచివరస్థానంలో ఉంది.

వెనుకబాటుకు పని ఒత్తిడే కారణమా..!?

జిల్లాలో ఇంటిపన్నుల వసూళ్లలో వెనుకబాటుకు పంచాయతీ కార్యదర్శులపై పనిఒత్తిడి కారణంతోనే చేయలేకపోతున్నామని చెబుతున్నారు. పోడురైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇస్తామని రాష్ట్రప్రభుత్వం చెప్పడంతో ఫారెస్టు అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సర్వేచేసి నివేదికలను రాష్ట్రప్రభుత్వానికి అందజేశారు. ఇటీవల రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఆరు గ్యారెంటీల అమలు కోసం పది రోజులపాటు 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియతో ఇంటిపన్నుల వసూళ్లు ఆలస్యమైంది. అయితే కార్యదర్శులకు అందుబాటులో కార్వోబార్లు ఉన్నప్పటికి గ్రామ అభివృద్ధి కోసం పంచాతీల్లో పన్నుల వసూళ్లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇచ్చిన టార్గెన్‌ను పూర్తి చేస్తాం..
హరిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి

ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచి నూటికి నూరుశాతం వసూలు చేసే విధంగా చర్యలు చేపడుతాం. ఇప్పటికే పంచా యతీ కార్యదర్శులకు ఇంటిపన్నుల వసూళ్లపై ప్రతిరోజు ఆన్‌లైన్ లో ద్వారా కార్యదర్శులకు సమావేశం నిర్వహిస్తున్నాం. 13 రోజుల్లో ఆయా గ్రామాల్లో ఉన్న పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలుపేందుకు కృషి చేస్తాం.


మండలాల వారీగా బకాయి (రూ.లలో) ఇలా...

మండలం	మొత్తం	వసూలు	పెండింగ్
గంగారం	559323	559289	34
డోర్నకల్	1590817	1588667	2150
తొర్రూరు	3185771	2867317	318454
కొత్తగూడ	1776761	1565508	211253
మరిపెడ	1824386	1582485	241901
దంతాలపల్లి	1800514	1502626	297888
కురవి	5458246	4483772	974474
చిన్నగూడూరు	1075495	881976	193519
నెల్లికుదురు	8763710	6947482	1816228
గార్ల	6400374	4912733	1487641
మహ-బాద్	5044639	3858920	1185719
నర్సింహులపేట	2615729	1928046	687683
బయ్యారం	5836011	4141908	1694103
గూడూరు	7685549	5264043	2421506
కేసముద్రం	11105996	6195860	4910136
పెద్దవంగర	3896347	1833736	2062611
మొత్తం :	68619668	50114368	18505300

విజయీభవ

నేటి నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు షురూ

- 49 కేంద్రాల ఏర్పాటు, హాజరుకానున్న 9,181 మంది విద్యార్థులు
- విధులు నిర్వహించనున్న 589 మంది సిబ్బంది
- సందేహాల నివృత్తికి 'హెల్ప్‌లైన్' ఏర్పాటు


మానుకోటలోని ఓ ప్రైవేట్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో సీటింగ్ అలాట్‌మెంట్ వేస్తున్న సిబ్బంది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 17 : జిల్లాలో సోమవారం (నేటి) నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్ల ను జిల్లా విద్యాశాఖ పూర్తి చేసింది. ఎస్సెస్సీ పరీక్షలకు 8,191 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. కాగా, పరీక్ష పత్రాలు స్థానిక పోలీసుస్టేషన్లకు చేరుకున్నాయి. ఏ రోజు జరిగే పరీక్ష ప్రశ్నాపత్రాలను ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ సెంటర్లకు తీసుకువెళ్లనున్నారు.

ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్..

పదో తరగతి పరీక్షల నిర్వాహణకు జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 439 మంది ఇన్విజిలెటర్లు, 49 మంది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 49 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 3 ప్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 49 మంది సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు మొత్తం సుమారు 589 మందిని కేటాయించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

సందేహాల నివృత్తికి..

ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా సందేహాలుంటే జిల్లాస్థాయిలో జిల్లా హెల్ప్‌లైన్ నెంబర్ : 94905 56656, ప్రభుత్వ పరీక్షల సహాయాధికారి మందుల శ్రీరాములు సెల్ నెంబర్ : 98497 61012, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సెల్ నెంబర్ : 79950 87625 సంప్రదించాలన్నారు. మండలస్థాయిలో బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, మరిపెడ, చ్నిగూడూరు మండలాలలకు చెందిన విద్యార్థులు ఎంఈవో పూల్‌చంద్ సెల్‌నెంబర్ : 96181 62337, దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు, తొర్రూరు, పెద్దవంగర మండలాల విద్యార్థులు ఎంఈవో జి.రాము సెల్‌నెంబర్ : 99499 39302, గంగారం, గూడూరు, కొత్తగూడ, కేసముద్రం మండలాల విద్యార్థులు ఎంఈవో శ్రీదేవి సెల్‌నెంబర్ :99631 69492ను సంప్రదించాలన్నారు.

బీజేపీ జెండాను ఎగురవేస్తాం

- పార్లమెంటరీ ప్రభారి వెంకట్‌నారాయణరెడ్డి


మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌నారాయణరెడ్డి

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 : మహబూబాబాద్ పార్లమెంట్ సీటును భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ పార్లమెంటరీ ప్రభారి నూకల వెంకట్‌నారాయణరెడ్డి దీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం మహబూబాబాద్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అవుతారని, ప్రపంచ దేశాలు చెబుతున్నాయని అన్నారు. కేంద్రంలో బీజేపీకి 400 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలివెంకటేశ్వర్‌రావు, చింతలపుడి భాస్కర్ రెడ్డి, మోసంగి మురళి, ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సతీష్, దేవేందర్‌రావు, వద్దిరాజు రాంచందర్‌రావు, రాచకొండ కొమురయ్య, దార ఇందుభారతి, కొమ్మాల్ రెడ్డి, సురేందర్, సంపత్, వెంకటాచారి, పైండ్ల శ్రీనివాస్, నాగమణి, రాజుగౌడ్, నర్సింహారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

'మద్యం తాగి వాహనాలు నడుపొద్దు'


ఈదులపూసపల్లిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, మార్చి17 : మద్యంతాగి వాహనాలను నడుపొద్దని డీఎస్పీ తిరుపతిరావుసూచించారు. జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేసిన తర్వాతనే వాటిని పంపించినట్లు చెప్పారు. వాహనాలను మద్యం తాగి నడిపితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికా రెడ్డి, ఏఎస్సై రమేష్, బ్లూకోర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద చెక్‌పోస్టు ప్రారంభం..

కేసముద్రం : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతమైన కేసముద్రం కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును రాత్రి డీఎస్పీ తిరుపతిరావు సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు

- కోడ్‌ను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు
- పార్లమెంట్ ఎలక్షన్ల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చిందని చెప్పారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రాష్ట్రంలో ఎంపీ స్థానాలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వస్తుందని, 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూటినీ, 29న ఉపసంహరణ, మే 13న ఎన్నికల పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెలువడనున్నాయని చెప్పారు.

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని డోర్నకల్, మానుకోట, నర్సంపేట, ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని అద్వైత్‌కుమార్‌సింగ్ పేర్కొన్నారు. మానుకోట పార్లమెంట్ నియోజక కవర్గంలో మొత్తం 15,28, 419 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 7,45,554 మంది, మహిళలు 7,81,339 మంది, థర్డ్ జెండర్స్ 105 మంది, 1421 మంది సర్వీస్ ఓటర్లున్నారని తెలిపారు. 1158 లోకేషన్లలో 1783 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 13 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్‌లను గుర్తించామని అందులో డోర్నకల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 8, మానుకోటలో 4, ఇల్లందు పరిధిలో ఒక్కటి ఉందన్నారు.

ఎంసీసీ అమలుతో 7చెక్ పోస్టులు..


మోడల్ కోడ్‌ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. వీఎస్టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంసీసీ, వ్యయం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, స్వీప్‌కు సంబంధించిన కార్యక్రమాల పర్యవేక్షణకు 16 మందినోడల్‌అధికారుల నియమించామని పేర్కొన్నారు. ఇప్పటికే ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పూర్తయిందని, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. అన్నిపోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా ఎన్నికల కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి నింతరం సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం సి-విజిల్ యాప్, 1950 ద్వారా తెలిపితే పరిష్కరిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రచార సభల అనుమతులు సకాలంలో దరఖాస్తులు చేసుకుంటే ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరి చేస్తామన్నారు. సోషల్ మీడియాలో ఫేక్‌న్యూస్‌లు సృష్టిస్తే ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

అదనపు ఎస్పీ చెన్నయ్య

పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అదనపు ఎస్పీ చెన్నయ్య తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగాయని గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని వాటిపై ప్రత్యేక నిఘాను ఉంచుతామన్నారు. జిల్లా నుంచి 800 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారని, అదనంగా సెంట్రల్ ఫోర్స్ కూడా వస్తుందని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పక్కాగా అమలు చేస్తామని, సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులద్వారా నిఘాను పెంచుతామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆదివారం ఉష్ణోగ్రతలు	గరిష్టం : 34.0° C	కనిష్టం : 23.5° C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సోమవారం	సా : 6.32 గం..
సహర్ :	మంగళవారం	ఉ : 5.00 గం..

'ఎంపీ ఎలక్షన్స్ ముగిసేవరకు గ్రీవెన్స్ రద్దు'

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ (కోడ్) ముగిసేంత వరకు గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలోని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పదవులపై పెదవి విరుపు

కీలక నేతలకు, సీనియర్లకు దక్కని నామినేటెడ్ పోస్టులు

- మంత్రుల నియోజకవర్గాల్లోని నేతలకు ఝలక్
- వరంగల్ తూర్పు, ములుగు, భూపాలపల్లి నేతలకు నిల్
- ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలోని నేతలకూ నిరాశే..
- ఇక జిల్లా స్థాయి పదవులపైనే ఆశలు





వరంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల పంపకం నేతల్లో అసంతృప్తి రగిలిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన నేతలకు, సీనియర్లకు నామినేటెడ్‌లో గుర్తింపు దక్కలేదనే ఆవేదనలో ఉన్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవటంపై కాంగ్రెస్ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టికెట్ త్యాగం పేరుతో కొందరికే పదవుల ఇచ్చారని, మిగతా వారికి గుర్తింపేదని ఆందోళనలో కొందరు నేతలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తే.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేవలం ముగ్గురికి మాత్రమే పదవులు లభించటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు కాంగ్రెస్ జెండా మోసిన తమకు ఇంకెప్పుడు గుర్తింపని కాంగ్రెస్ నేతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

ముగ్గురికే పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలామంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలు అనేక మంది వీటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే గత శనివారం రాత్రి 37మందితో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రెండు డజన్లకుపైగా ఆశావాహులు ఉంటే.. కేలవం ముగ్గురికి మాత్రమే పదవులు దక్కాయి. దీంతో చాలామంది నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యనాయక్‌కు గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అయితే పోదెం వీరయ్య ములుగు జిల్లా వాసి అయినప్పటికీ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో పోదెం వీరయ్య పోస్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖాతాలోకి వెళుతుందని, అలాగే అయిత ప్రకాష్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని మల్హర్ మండలంకు చెందిన నేత. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆయనకిచ్చిన పోస్టు

మిగతా 7వ పేజీలో..



గంజాయి మత్తులో యువత

- పొరుగు రాష్ట్రాల నుంచి నగరానికి పెద్దఎత్తున దిగుమతి
- ప్రముఖ విద్యా కేంద్రాల్లో గుట్టుగా విక్రయాలు
- కట్టడి చేయడంలో ఖాకీలు, ఎక్సైజ్ శాఖల నిర్లక్ష్యం

వరంగల్ క్రైం, మార్చి 17: వరంగల్ నగరంలో గంజాయి గుప్పుమంటోంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న గంజాయి ప్రముఖ విద్యా సంస్థలు కేంద్రంగా చేసుకుని విక్రయిస్తునట్లు తెలిసింది. గంజాయి సేవిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలిసి మరీ యువత ఈ మత్తుకు బానిసవుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తును యువత ఆస్వాదిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలో సంపన్నుల పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యాసంస్థల హాస్టల్స్‌లో ఉండే యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు అధికారిక సమాచారం. యువతను టార్గెట్ చేసుకుని నగరంలో లక్షల్లో గంజాయి దందా సాగుతోంది. గంజాయి విక్రయాలను కట్టడి చేయడంలో ఖాకీలు వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అప్రమత్తం కాకుంటే వరంగల్ నగరం మరో పంజాబ్ అయ్యే ప్రమాదం ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి

పొరుగురాష్ట్రాలైన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి మీదుగా పెద్దఎత్తున గంజాయి వరంగల్ నగరానికి చేరుకుంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్డు మార్గాన రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనితో ఈదందా చేసే వారు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. ఒరిస్సా, విశాఖపట్నం నుంచి వచ్చే దళారులు రైలులో గుట్టు చప్పుడు కాకుండా లక్షల్లో గంజాయిని నగరానికి చేర్చుచున్నారు. ఈ వారంరోజుల్లోనే దాదాపు రెండువందల కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. నామమాత్రపు తనిఖీలతోనే ఈ మేరకు పట్టుకుంటే ఇంకా ఏ మేరకు రాష్ట్రానికి చేరుకుంటుందో ఊహించుకోవచ్చు. రాష్ట్రం చేరుకుంటున్న గంజాయి ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ చేరుచున్నట్లు తెలిసింది.

కాగా గత సంవత్సరం (2023) వరంగల్ నగరంలో పోలీసులు పట్టుకున్న గంజాయి 417 కేజీలు కాగా, దీనివిలువ రూ.1కోటి 4లక్షల 42వేలు. ఈ యేడు మూడు మాసాల్లో పట్టుకున్న గంజాయి జనవరి 48.86 కేజీలు కాగా, దీని విలువ రూ.12లక్షల 22వేలు. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 17.5కేజీల గంజాయి పట్టుకోగా దీని విలువ రూ.4లక్షల 38వేలుంటుంది. ఈ లెక్కలు గమనిస్తే నగరంలో గంజాయి దందా ఏధేచ్ఛగా సాగుతున్నట్లు స్పష్టమవుతుంది.

పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)



విద్యార్థులే లక్ష్యంగా..

వరంగల్ నగరంలోని యువత మత్తులో మునిగిపోతున్నారు. వందల కిలోల గంజాయి నగరానికి చేరుతుండటం గమనిస్తే యువత ఏ మేరకు దీనికి బానిసలయ్యారో తెలుస్తోంది. నగరానికి వస్తున్న గంజాయిని పొడి చేసి సిగరెట్లు, చాక్లెట్ల రూపేణా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కేజీ గంజాయి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుందని తెలిసింది. దళారులు 10గ్రాములు, 20గ్రాముల చొప్పుల ప్యాకెట్స్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. 10గ్రాముల ప్యాకెట్ రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక సిగరెట్ గంజాయి దమ్ము లాగిస్తే ఆరు బీర్లు తాగినంత నిషా వస్తుందని వైద్యులు చెబుచున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నిషాను యువత పొందుతున్నారు. ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే యువత గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. రింగ్‌రోడ్డు పరిసరాల్లో విద్యార్థులు గంజాయిని సేవిస్తే పట్టుబడుతుండగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం. ఇటీవల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు తెలిసింది. సంపన్నుల పిల్లలుగా గుర్తించి హెచ్చరించి పంపినట్లు తెలిసింది. ఇలా నగర కళాశాలల్లో ఈ దందా భారీగానే సాగుచున్నట్లు అధికారిక సమాచారం.













సోమనర్సయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు సముద్రాల సోమనర్సయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రోపోమెట్రిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దెయిర్ పెర్మార్మెన్స్'అనే అంశంపై వరంగల్ కిట్స్ కళాశాల ప్రొఫెసర్ పి. రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో సోమనర్సయ్య డాక్టరేట్ పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలానికి చెందిన సోమనర్సయ్యను కేయూ ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.రామనాథ్‌కిషన్, బీవోఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్‌ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఏటీబీటీ ప్రసాద్ అభినందించారు.

విచక్షణ కోల్పోకు.. విధిరాతను చెరపనీకు..



- పరీక్షల సమయాల్లో ఒత్తిడికి గురికావొద్దు
- ఇష్టపడి చదివితే అంతా సులభమే..
- విద్యార్థులూ.. ఆత్మన్యూనత భావాన్ని విడనాడాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 : తీవ్రమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోతూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. క్షణికావేశంలో బలవన్మరణాల పాలవుతున్నారు. పరీక్షల సమయాల్లో తీవ్ర మనోవేదనకు గురువుతున్న కొంతమంది విద్యార్థులు.. విచక్షణను కోల్పోతూ వారి తలరాతను వారే చెరిపేసుకుంటున్నారు. విద్యార్థులెప్పుడు ఇష్టపడి చదివితే సంక్లిష్టమైన సందర్భాలు కష్టపడకుండానే దాటేయవచ్చునని విద్యారంగ నిపుణులు, మనోవికాస నిపుణులు చెబుతున్నారు. మార్కులే పరమావధిగా కాకుండా విజ్ఞానం కోసం మాత్రమే చదువుతున్నామనే జిజ్ఞాసను విద్యార్థులు అలవర్చుకోవాలని వారు సూచిస్తున్నారు. విజయావకాశాలకు దారులు వెతుక్కుంటూ ముందుకు సాగాలని వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై అనవసరపు భారాలను మోపవద్దని వారు హెచ్చరిస్తున్నారు. సానుకూల దృక్పథంతో చదువుకునే వాతావరణంలోకి విద్యార్థులను తీసుకొని రావాలని హితబోధ చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థిని సాహిత్య మృతి, గతంలోనూ అనేక మంది విద్యార్థులు మార్కులు బాగా రాలేదని, పాస్ కాలేదని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఇంటర్ పరీక్షలతో పాటు సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దని 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒత్తిడికి లోనుకావొద్దు.. మనోధైర్యాన్ని కోల్పోవద్దు..

విద్యార్థులెప్పుడు వారి సామర్థ్యాల మేరకు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు చదవుకోవాలి. ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంలో ముందుకు సాగాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను ఎంచుకునే ముందుగానే అందుకు తగిన శ్రమ, ప్రయాసలను బేరీజు వేసుకొని అందుకు అనుగుణంగా వారి మానసిక పరిస్థితిని సిద్ధం చేసుకోవాలని వారు చెబుతున్నారు. పరీక్షలంటే విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకునే వేదికలుగా గుర్తించాలి. గెలుపోటములను సరిసమానంగా తీసుకునే మనోసిద్ధిని కలిగి ఉండాలని వారు సూచిస్తున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను దరిచేరకపోతే ప్రత్యామ్నాయ లక్ష్యాల వైపు దూసుకెళ్లాలే తప్ప ప్రాణపరిహారం చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా సందర్భంలో ఒత్తిడికి లోనైతే ఆ విషయాలను స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకొని ఊరట చెందాలంటున్నారు.

భారాలను మోపొద్దు.. తీరాలకు చేర్చొద్దు..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై తీవ్రమైన భారాన్ని మోపొద్దని మనోవికాస నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాల మేరకు, వారికి ఇష్టమైన కోర్సుల్లో మాత్రమే చేర్పాలని చెబుతున్నారు. తల్లిదండ్రుల కోరికలను వారి పిల్లలపై రుద్దుతూ వారి మనోనిబ్బరాన్ని కోల్పోయేలా చేసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పద్ధతులు మార్చుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల మేథస్సును ఇతరులతో ఎప్పుడూ పోల్చవద్దని సూచిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేథస్సును వెలికి తీస్తూ వారి ఇష్టాల మేరకు విద్యాబుద్ధులు చెప్పించాలే తప్ప తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని చెబుతున్నారు. విద్యార్థులను విమర్శించకుండా వారిని సక్రమమైన దారుల్లో పెట్టేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలంటున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మెలగుతూనే వారిలో లక్ష్యాలను చేరుకునే తృష్ణను రగించాలని సూచిస్తున్నారు. జీవితంలో విఫలమమ్మై విజయాలు సాధించిన వారి వివరాలను విద్యార్థులకు కథలుగా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. విద్యార్థుల్లో ఉండే ఆత్మన్యూనత భావాలను తొలగించేందుకు నిష్ణాతులతో అవగాహన కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

డాక్టర్ బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు



విద్యార్థులందరూ ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలను అంచనా వేస్తూ సానుకూల వాతావరణంలో చదువుకునేలా వారిలో ఒత్తిడిని దూరంచేయాలి. మార్కులకు బదులుగా విద్యార్థులకు విజయావకాశాలకు దారులను చూపేందుకు కృషి చేయాలి.

దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 4

కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ మొదటి, రెండో, మూడో ఏడాది బీఏ, బీకాం, జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో 2022-2023 వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్షల కోసం తమ ఫీజులను ఏప్రిల్ 4వ వరకు ఎలాంటి అపరాధరుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో, మూడో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు, అలాగే ఇంప్రూమెంట్ రాయాలనుకునే విద్యార్థులు తమ ఫీజులను చెల్లించుకోవాలని తెలిపారు. అన్ని పేపర్లకు రూ.600, రెండు పేపర్లకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ఒక్కో పేపర్‌కు రూ.300 చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లించిన చలనా, ఫొటో, ఫెయిలైనమెమో జతచేసి దూరవిద్యకేంద్రంలో అందచేయాలన్నారు.

పల్లెపాడు దామోదర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాశోజీ జంక్షన్, మార్చి 17: వినియోగదారుల ఉద్యమంలో సామాజిక సేవ కార్యక్రమాలు 30ఏళ్ల పని చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 17వ తేదీన చెన్నైలో జరిగిన నేషనల్ కన్వెన్షన్‌లో చైర్మన్ అనంత్‌శర్మ చేతులమీదుగా మెడల్ అందుకున్నారు. డాక్టర్ పల్లెపాడు దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతలు జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్‌మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారులకు పటిష్ఠమైన రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన 2019 వినియోగదారుల చట్టం అమలు కోసం దక్షిణాది రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషికి గాను జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, సీసీఐ జనరల్ సెక్రటరీ సాంబరాజు చక్రపాణి, సీసీఐ తెలంగాణ ప్రెసిడెంట్ ఎం.సుదర్శన్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే



రుద్రేశ్వరాలయంలో జస్టిస్ అరాధేతోపాటు ఇతర న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సతీసమేతంగా సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వర్తింపచేశారు. జస్టిస్ ఆరాధే వెంట హైకోర్టు జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్, జిల్లా పోర్టుపోలియో జడ్జి, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్, హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, హనుమకొండ జిల్లా కోర్టు జడ్జి ఎం. క్రిష్ణమూర్తి వేయిస్తంభాల గుడికి విచ్చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితుడు గంగు మణికంఠ శర్మ పూర్ణకుంభంతోస్వాగతం పలికారు. మంగళవాయిద్యాలతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆలయ నాట్య మండ పంలో తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలను అందచేశారు. వేద ఆశీర్వచనం చేశారు.

వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆ తర్వాత పునరుద్ధరించి కల్యాణ మండ పాన్ని తిలకించారు. జస్టిస్ ఆరాధే సందర్శకుల డైరీలో వేయిస్తంభాల గుడిని ఒక అద్భుతమైన కట్టడంగా అభివర్ణించారు. కాకతీయులు కళా రాధకులని, 800 యేళ్ల కిందట నిర్మించిన ఇలాంటి దేవాలయం ఈతరం వారు కూడా తరించడం గొప్ప అదృష్టమని, ఆలయాన్ని సందర్శించడం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటయ్య, అర్చకుడు ప్రణవ్, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్ దేవాదాయ శాఖ సిబ్బంది ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం డీఏలను మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులతో పాటు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి కనీస వసతుల ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఈనెల నుంచి ఉద్యోగ విరమణలున్నాయని, ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బెనిఫిట్లను సత్వరమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యానారాయణ, నాయకులు బిల్ల సుబ్బారావు, రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్త్రీవాద రచయిత చలమే..

- అన్నిట్లో స్త్రీ, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలి
- డాక్టర్ అంపశయ్య నవీన్.. ఐదు గ్రంథాల ఆవిష్కరణ
- ఘనంగా రుద్రమ ప్రచురణల దశాబ్ది వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో మొదటి స్త్రీవాద రచయిత చలమేనని, అన్ని విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలని ప్రముఖ నవలా రచయి త డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠ శాలలో ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈఐదు గ్రంథాల ఆవిష్కరణలను ఐదు సమావేశాలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిశెట్టి రజిత, కొమ రాజు రామలక్ష్మి నిర్వాహకులుగా వ్యవహరించారు. మొదటి సమావేశంలో చిమమండ న్గోజి అడిచే గ్రంథాన్ని డాక్టర్ అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఇలాంటి పుస్తకాలు చదివితే స్త్రీల విషయంలో అభిప్రాయాలు మారుతాయని అన్నారు. పుస్తకాన్ని మెట్టు రవీందర్ పరిచయం చేశారు. రెండో సమావేశంలో తమ్మెర రాధిక హవేలీ దొరసాని కథా సంపుటిని బీవీఎన్ స్వామి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాధిక కథలో ప్రత్యేకత కనిపిస్తుందని, విభిన్న వస్తువులతో వాస్తవిక దృక్పథం ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని మాలతీలత పరిచయం చేశారు. మూడో సమావేశంలో భార త దేశంలో వితంతు వ్యవస్థ అనే గ్రంథాన్ని ఆవిష్కరించిన తిరునగరి దేవకీదేవి దేశంలోని వితంతు దుర్భర పరిస్థితులను వివరించారు. తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగో సమావేశంలో తమ్మెర రాధిక మరొక గ్రంథం కాలం జాడలు తీస్తూ.. కవితా సంపుటిని ఆవిష్కరించిన పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాధిక కవిత్వంలో మానవ సంబంధాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని చంద్రకళ పరిచయం చేశారు. ఐదో సమావేశంలో అని శెట్టి రజిత కాలం కాన్వాస్ మీద కతా సంపుటిని ఆవిష్కరించిన వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత కాన్వాస్ పెద్దదని, ఆమె కవిత్వంలో వస్తు వైవిధ్యం తాత్వికత ఉంటుందన్నారు. ఈపుస్తకాన్ని సింగరాజు రమాదేవి పరిచయం చేశారు.

ఈ సమావేశంలో నాగిల్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, బి.రమాదేవి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, పల్లేరువీరాస్వామి, బిల్ల మహేందర్, నేరెళ్ల శ్రీనివాస్ సౌహార్ద్ర సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కొమర్రాజు రామలక్ష్మి ముగింపు వ్యాఖ్యాలు పలికిన ఈ సమావేశాలలో కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, కళాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొర్రెలకాపరిని కాటేసిన పాము

- పామును సంచిలో వేసుకుని ఆస్పత్రులకు పరుగులు
- అది ఏ పామో తెలియక చికిత్స చేయని వైద్యులు





సంచిలో పామును వేసుకుని ఎంజీఎం ఆస్పత్రికి వచ్చిన రాజెల్లు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : పాము కాటుకు గురైన గొర్ల కాపరి కాటేసిన పామును తీసుకుని వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగ్గా, అది ఏ పామె తెలియక వైద్యం చేయని ఉదంతం వరంగల్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు నక్క రాజెల్లు కథనం ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన గొర్ల కాపరి నక్క రాజెల్లు రోజులాగే చెరువులో గొర్లను కాస్తున్నాడు. ఎంత ఎక్కువగా ఉండడంతో ఓ చెట్టు కింద సేద పడుకున్నాడు. చెట్టుపై నుంచి గుర్తు తెలియని పాము కింద పడింది. పామును గమనించిన ఓ గొర్రె దానిపై దాడి చేయడంలో పాము గొర్లకాపరి చేతిపై కాటు వేసింది. దీంతో అతడు పామును చంపి, దానిని ఓ సంచిలో వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వైద్యం కోసం వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు ఓ ఇంజక్షన్ వేసి గ్లూకోజ్ పెట్టి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి పామును తీసుకుని ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నాడు. పామును గమనించిన వైద్యులు అది రక్తపింజర, కొండచిలువ అనేది తేల్చలేకపోతున్నామని, సరైన వైద్యం చేయలేమని వైద్యులు తేల్చారు. ఏం చేయాలో తెలియక, బంధువుల సూచన మేరకు రాయపర్తి మండలంలోని కొండాపురం గ్రామానికి వెళ్లి నాటు వైద్యం చేసుకున్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. కాటు వేసిన చోటచేయి వాపు వచ్చింది. ప్రస్తుతం రాజెల్లు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న బ్రైడల్ ఫ్యాషన్ షో

- విదేశీయులను ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బ్రైడల్ ఫ్యాషన్ షోలో భారతీయ మహిళలు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):అమెరికా కెంటకీలోని లూయిస్‌విల్లేలో శనివారం రాత్రి స్పీడ్ ఆర్ట్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాస భారతీయుల సాంస్కృతిక ప్రదర్శనలు విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాన్ డీగో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సేకరించిన భారత్‌తో సహా దక్షిణాసియా దేశాలకు చెందిన అత్యంత ప్రాచీనమైన చిత్ర కళాఖండాల గురించి ఆమెరికాలోని చిత్ర కళాభి మానులకు, మ్యూజియం సందర్శకులకు అవగాహన కలిగించడానికి చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్పీడ్ ఆర్ట్ మ్యూజియం హాల్‌లో లూయిస్‌విల్లేలోని ప్రవాస భారతీయులతో ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 50 మందికిపైగా ప్రవాస భారతీయులు వారి కుటుంబసభ్యులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ప్రధానంగా ప్రవాస భారతీయ మహిళల వధువుల వేషధారణ (బ్రైడల్ షో) విశేషంగా ఆకట్టుకున్నది. భారత దేశంలోని ఆయా రాష్ట్రాల్లో వివాహాల సందర్భంగా ఆ రాష్ట్రాల సంప్రదాయాల ప్రకారం వధువులను అలంకరించే తీరు, వారి వస్త్రధారణ, నగల గురించి తెలియ చేసేఈ ప్రదర్శన ఆద్యంతం విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నది. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో వధువు ఆ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా అందంగా అలంకరించుకొని వేదికపై నిర్వహించిన క్యాట్ వాక్, మేడ్ ఇన్ ఇండియా పాట నేపథ్యంగా ఇచ్చిన ఈ ప్రదర్శన అబ్బురపరిచింది. అనంతరం సమర్పణ్ నృత్య పాఠశాల ప్రవాస భారతీయ పిల్లలు నిర్వహించిన నృత్య ప్రదర్శన కూడా విశేషంగా ఆకట్టుకున్నది. బ్రైడల్ షోకు లక్ష్మి, దీప్తి కొరియోగ్రాఫర్లుగా వ్యవహరించారు.

పదవులపై పెదవి విరుపు

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోటాలోకి వెళుతుందని అంటున్నారు.

సీనియర్లు, కీలక నేతలకు ఝలక్

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి నామినేటెడ్ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే సీనియర్ నేత బొద్దిరెడ్డి ప్రకార్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, గత ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్‌తో అనేక మంది సీనియర్లకు నామినేటెడ్ పదవులు వరించకపోవటంపై కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. మరో మహిళ నేత కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని భావించినప్పటికీ నిరాశే మిగిలింది. అలాగే భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్‌కు కూడా నామినేటెడ్ పోస్టు దక్కకపోవడం ఆయన వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవి ఒక్కరికి కూడా దక్కలేదు. మీసాల ప్రకాష్, నల్లొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు నామినేటెడ్ పోస్టులు వస్తాయనే ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగు నుంచి కూడా ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని క్యాడర్ భావించినప్పటికీ నిరాశే మిగిలింది. నర్సంపేట, డోర్నకల్, భూపాలపల్లి నియోకవర్గాల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కకపోవటంతో కేడర్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేలు లేని చోట కూడా..

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ ప్రతినిధులు లేకుండా పోవటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ నుంచి శనిగపురం ఇందిరకు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఆశించారు. అయితే వీరికి గానీ, వారి అనుచరులకు కానీ నామినేటెడ్ పదవులు దక్కకపోవటంపై నేతలు నారాజ్ అవుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఇందిర తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోణంలో ఇందిరకు ఇవ్వకపోయినప్పటికీ ఇదే నియోజకవర్గానికి చెందిన మరో నేతకు నామినేటెడ్ పోస్టు ఇస్తే ప్రొటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక జిల్లాస్థాయి పదవులే..

రాష్ట్రస్థాయిలో కీలక నామినేటెడ్ పోస్టులు దాదాపు పూర్తి చేశారు. మిగిలిన కొన్ని పోస్టులకు రాష్ట్రస్థాయిలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపైన నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్‌లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించాల్సి ఉంది. వీటితో పాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ తొర్రూరు పట్టణ, రూరల్ అధ్యక్షులుగా రవిబాబు, పులేందర్


పులేందర్


రవిబాబు

తొర్రూరు, మార్చి 17 : బీజేపీ తొర్రూరు అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షులను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. తొర్రూరు అర్బన్ అధ్యక్షుడిగా అలిసేరి రవిబాబు, రూరల్ అధ్యక్షుడిగా కస్తూరి పులేందర్‌లను ఎంపిక చేశామని వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తమపై విశ్వాసంతో అధ్యక్షులుగా నియమించిన జిల్లా అధ్యక్షులకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవంగర అధ్యక్షుడిగా ఉడుత శ్యామ్‌యాదవ్..



పెద్దవంగర : బీజేపీ పెద్దవంగర మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉడుత శ్యామ్‌యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉడుత శ్యామ్‌యాదవ్ మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేస్తూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం, పార్టీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. తన నియమాకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, పాలకుర్తి నియోజకవర్గ నాయకులు లేగ రామ్మోహన్‌రెడ్డి, ధర్మరపు వెంకన్న, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గార్ల మండల అధ్యక్షుడిగా జంపాల శ్రీను..



గార్ల : భారతీయ జనతా పార్టీ గార్ల మండల అధ్యక్షులుగా మండలంలోని పెద్ద కిష్టాపురం చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు జంపాల శ్రీను నియమితులైనారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శనివారమే నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను బీజేపీ పార్టీ అభివృద్ధికి పాటు పడుతానన్నారు. ఈ పదవి ఎంపికకు సహకరించిన వెంకటేశ్వరరావు, విమల్ కుమార్‌జైన్, దేవానాయక్, అజ్మీరా రాము, తోడేటి నాగరాజు, జశ్వత్ ఠాకుర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మరిపెడ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ..



మరిపెడ : బీజేపీ మరిపెడ మండల అధ్యక్షుడిగా నీలికుర్తి గ్రామానికి చెందిన ఆకుల రామకృష్ణ నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆదివారం వైవీ రావు తెలిపారు. గత ఐదేళ్లుగా రామకృష్ణ పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో బీజేపీ మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జిల్లా బాధ్యులకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు కులస్తుల అభ్యున్నతికి పాటు పడాలి

- మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 : మున్నూరు కాపు కులస్థుల అభ్యున్నతికి పాటు పడాలని తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్ పటేల్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడారు. మున్నూరు కాపు ఉద్యోగులంతా కలిసికట్టుగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తొలుత సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు జిన్నారెడ్డి శ్రీనివాస్, పెండ్లి అశోక్, తూడి వెంకటేశ్వర్లు, ఆవుల కుమారస్వామి, వాసం శ్రీనివాస్, తాడూరి నరేందర్, ఆకుల వెంకటరావు, శ్రీనివాస్, నరేందర్, నారాయణ, నాగేందర్, మహేందర్, వెంకటేశ్వర్లు, మల్లీశ్వరీ, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

'పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి'


విక్రమ్‌నగర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్డీ సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి దేవేందర్

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 : సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూసపల్లి కుట్ర కేసు బనాయించిందని, ఆ కేసును వెంటనే ఎత్తివేయాలని ఎన్డీ సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని విక్రమ్‌నగర్ కాలనీలో ఆదివారం అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను ఖమ్మం సమీపంలో ఫిబ్రవరి 14న అరెస్టు చేసి 17న రిమాండ్‌కు తరలించారని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పరిసరాల్లోని పూసపల్లి వద్ద అరెస్టును చూపించి రిమాండ్ రిపోర్టులో తప్పుగా నమోదు చేశారని ఆరోపించారు. ఆయనతో పాటు ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్, గౌని ఐలయ్య, జె.సీతారామయ్యపై రాజద్రోహం, అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నారని పలు సెక్షన్‌ల కింద నమోదు చేశారని, వాటిని వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కృష్ణవేణి, బ్రహ్మచారి, భిన్నమ్మ, పొన్నం రమ, శివ్వారపు శారద పాల్గొన్నారు.

- బయ్యారం : సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా మోపిన పూసపల్లి కేసును వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీ బయ్యారం మైదాన మండల కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బయ్యారంలో ఎన్డీ నేతలు పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పరిసరాలలోని పూసపల్లి వద్ద అరెస్టు చూపించిన రిమాండ్ రిపోర్ట్‌లో తప్పుడు పద్ధతులకు పోలీసులు పాల్పడినట్లు ఆరోపించారు. 50 ఏళ్ల నుంచి బహిరంగంగా ప్రజాసంఘాలలో పని చేస్తున్న నాయకులను కూడా ఈ కేసులో ఉద్దేశపూర్వకంగా ఇరికించారని విమర్శించారు. వివిధ ప్రజాసంఘాలలో పూర్తిస్థాయి నాయకులుగా, కార్యకర్తలుగా పనిచేస్తున్న వారిని నిషేధిత పార్టీకి చెందిన వారిగా చూపడం అత్యంత దుర్మార్గమైనదన్నారు. వివిధ ప్రజాసంఘాలతో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, ఆందోళనలు, పోరాటాలు చేసిన న్యూ డెమోక్రసీ నాయకులను నిషేధిత నక్సలైట్ పార్టీకి చెందిన వారిగా పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ప్రజాస్వామిక పాలన సాగిస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలి తప్పుడు కేసులను బనాయించటం, నిర్బంధం, అప్రజాస్వామిక పాలనకు పూనుకోవటం విచారకరమన్నారు. పూసపల్లి కుట్ర కేసును బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బిక్షం, వీరభద్రం, భగవాన్, లింగమల్లు, మంగీలాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మానుకోట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధురాలు

నెహ్రూసెంటర్, మార్చి 17 : మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబర్-1లో గల వెయింటింగ్ హాల్లో గుర్తు తెలియని వృద్ధురాలు (70) మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు దీర్ఘకాలిక అనారోగ్య వ్యాధితో మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు వృద్ధురాలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలు మెడలో నల్లటి దారంతో కట్టిన రుద్రాక్ష, సిమెంట్ కలర్ నైటీ (దుస్తులు) ధరించి ఉన్నట్లుపేర్కొన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసంసెల్ : 8712658600, 9494790619 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తొర్రూరులో యాచకుడు..

తొర్రూరు, మార్చి 17 : గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, మునిసిపల్ అధికారులు తెలిపిన కథనం ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం వద్ద సుమారు 55ఏళ్ల యాచకుడు పడిపోయి ఉండటంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకునేటప్పటికి యాచకుడు మృతి చెంది ఉన్నాడు. మృతుడు లేత బూడిదరంగు షర్టు, బ్లూకలర్ నైట్‌ప్యాంటు వేసుకుని ఉన్నాడు. పోలీసుల సమాచారం మేరకు మునిసిపల్ సిబ్బంది మృతదేహాన్ని స్థానిక మార్చురీకి తరలించారు. మృతుడిని 3 రోజులపాటు మార్చురీలో ఉంచుతారని, సంబంధికులు ఎవరైనా ఉంటే తొర్రూరు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రాంజీనాయక్ తెలిపారు. వివరాలకు ఫోన్: 8712656982, 8712656984 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సీతయ్య మృతి


సీతయ్య (ఫైల్)

డోర్నకల్, మార్చి 17 : డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వల్లభనేని సీతయ్య (90) అనారోగ్యంతో శనివారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయన తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వాములై రజకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. మృతుడు సీతయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సీతయ్య మృతి విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ శనివారం రాత్రి అమ్మపాలెంలో సీతయ్యమృతదేహం వద్ద నివాళ్లర్పించారు. సీతయ్య మృతి పట్ల సీపీఎం నాయకులు శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్‌కుమార్, ఉప్పనపల్లి శ్రీనివాస్, బొబ్బ వెంకట్‌రెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు.

గూడూరు బీజేపీ మండల అధ్యక్షుడిగా మల్లేష్



గూడూరు, మార్చి 17 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గూడూరు మండల అధ్యక్షుడిగా మచ్చర్ల గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. మల్లేష్ కొనసాగుతూ.. గతంలో ఎంపీటీసీగా, బీజేపీ పార్టీలో ప్రస్తుతం సొసైటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు మండలంలో బీజేపీ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఎమ్మార్పీఎస్-టీఎస్ మండల అధ్యక్షుడిగా సాంబయ్య

గూడూరు, మార్చి17 : ఎమ్మార్పీఎస్-టీఎస్ గూడూరు మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, దళిత రత్న కొండ్ర ఎల్లయ్య తెలిపారు. గూడూరులో ఆదివారంనిర్వహించిన సంఘ సమావేశంలో కమిటీని ఏర్పాటు చేసి నియామకపత్రాలను అందించారు. అధ్యక్షుడిగా నెమలి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా హెచ్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సప్పెట్ల రాము, జనగాం మహేష్, ప్రధాన కార్యదర్శులుగా మైదం నాగరాజు, పోలెపాక యాకయ్య, సహాయ కార్యదర్శిగా కొమ్ముల శ్రీనివాస్, కోశాధికారిగా గద్దల బాబు, యువసేన మండల అధ్యక్షుడిగా బోడ రవివర్మను ఎన్నుకున్నట్లు చెప్పారు. సభ్యులు పందుల సంజీవ, నాయకుడు బోడ ఎల్లయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి రెడ్డి సంఘం క్షీరాభిషేకం

కేసముద్రం, మార్చి 17 : రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కేసముద్రం విలేజిలో ఆదివారం రెడ్డి సంఘం అధ్యక్షుడు ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వృద్ధులను శాలువలతో సత్కరించి, చేతి కర్రలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పోలెపల్లి చెన్నారెడ్డి, కార్యదర్శి కాంతాల వెంకట్‌రెడ్డి, కోశాధికారి సంకు శ్రీనివాస్‌రెడ్డి, సంకెపల్లి రాంరెడ్డి, వేముల వెంకటాద్రిరెడ్డి, జి.లింగారెడ్డి, ఎస్.రఘోత్తంరెడ్డి, పోలెపల్లి పెద్దదేవిరెడ్డి పాల్గొన్నారు.

అటవీ ప్లాంటేషన్‌లో మంటలు

కేసముద్రం, మార్చి 17 : మండలంలోని కాట్రపల్లి సమీపంలో నాగారం వెళ్లే మార్గం వెంట అటవీశాఖ ప్లాంటేషన్‌లో శనివారం రాత్రి మంటలు లేచాయి. రాత్రి వేళ నిప్పంటుకొని ఎండిన ఆకులు కాలుకుంటూ జమాయిల్ చెట్లు కొన్ని స్వల్పంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : సీఐ


మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ హెచ్చరించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న రౌడీషీటర్లు ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు, అల్లర్లలో తలదూర్చవద్దని చెప్పారు. ఎవరైన ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని చెప్పారు. ఎస్సైలు శివ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..


గూడూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ బాబురావు

గూడూరు : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సీఐ బాబురావు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రౌడీషీటర్లు ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడవద్దని మందస్తుగా హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీటర్ నుంచి తమపేర్లను తొలగిస్తామని చెప్పారు. ఎన్నికల కోడ్ నియమనిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై నగేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

- మహబూబాబాద్-నర్సంపేట జాతీయ రహదారిపై సీఐ బాబురావు నేతృత్వంలో ఎస్సై నగేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానిత వాహనాలను ఆపి తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వార పరిశీలించి మద్యం సేవించిన వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కుంట ఉపేందర్

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

కురవి, మార్చి 17 : పెరిగిన ధరలకనుగుణంగా రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల నోటిఫికేషన్‌లను సవరించి వేతనాలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. కురవిలో ఆదివారం జరిగిన సీఐటీయూ మండలకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 73 షెడ్యుల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న 1.20 కోట్ల మంది కార్మికులు నష్టపోయే విధంగా కనీస వేతనాలు చాలా తక్కువగా నిర్ణయించారని తెలిపారు. పారిశ్రామిక వేత్తలఒత్తిడికి తలొగ్గకుండా కనీస వేతనాలు రూ.26 వేలుగా సవరించి జీవోను విడుదల చేయాలని కోరారు. జీపీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, నాగభూషణం, గోపయ్య, చంద్రవతి, గోపమ్మ, శ్రీను, వనజ, జయమ్మ, కిషన్ పాల్గొన్నారు.

యువత మద్యానికి దూరంగా ఉండాలి

- ఎస్సై కరుణాకర్

దంతాలపల్లి, మార్చి 17 : యువత మద్యానికి దూరంగా ఉండి సమాజ సేవలో ముందుండాలని ఎస్సై కరుణాకర్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని రేపోణి గ్రామంలో పోలీసులు, కళా బృందం సభ్యులతో గుడుంబా, గుట్కా, మద్యం, 100 డయల్, మహిళలకు సత్వర న్యాయం తదితర అంశాలపై గ్రామస్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా తయారీ, బెల్టు షాపుల నిర్వహణపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లోని యువత చదువుపై ఆసక్తి చూపి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గుడుంబా తయారు చేసే నల్లబెల్లం విక్రయించే వారిపేర్లను అందించాలన్నారు. పోలీసు అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రకాశ్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

'కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న జ్యోతిబసు

కురవి, మార్చి 17 : పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. కురవిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి సెంటర్లలో తాగునీరు, టాయిలెట్స్, మెడికల్ క్యాంప్ అందుబాటులో ఉంచాలన్నారు. బడా కార్పొరేట్ కళాశాలలు పదో తరగతి పరీక్షలు ముగియకముందే నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారని, అలాంటి కళాశాలలను గుర్తించి రద్దు చేయాలన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక వీరేందర్, నిమ్మశెట్టి మురళి, చంటి, మహేందర్, వినోద్, దేవేందర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గార్ల, మార్చి17 : మండల కేంద్రం సమీపంలో చలివాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నామని ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ తెలిపారు. గార్ల పట్టణానికి చెందిన ఆగాల రాముడుకు చెందిన ట్రాక్టర్ చంద్రగిరి సమీపంలోని చలివాగు నుంచి ఇసుకను నింపుకొని గార్లకు వస్తున్న సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇసుకట్రాక్టర్ కంట పడింది. పట్టుబడిన ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం

తొర్రూరు, మార్చి17 : పట్టణంలో సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం తొర్రూరు డిపోనుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వి.పద్మావతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులు బస్సులో ఆధార్‌కార్డు చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. బాలురు రాయితీ బస్‌పాస్ ఉండి హాల్‌టికెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాలకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. కాంబినేషన్ టికెట్ ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనుమతి ఉంటుందని, పాసులు లేనివారు తప్పనిసరిగా టికెట్‌లు కొనాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శిగా రాజు



చిన్నగూడూరు, మార్చి 17 : కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శిగా ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మారబోయిన వేంకటేశ్వర్లు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనఎన్నికకు సహకరించినకాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు భదయ్య, ఉపాధ్యక్షుడు మేగ్యా, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు వెంకట్య, ఉపాధ్యక్షుడు యాకన్న, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'సాగునీరు విడుదల చేయాలి'


లక్ష్మీపురంలో ఫోన్‌ద్వారా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సాగునీటి సమస్య వివరాలు తెలుపుతున్న ఎంపీ కవిత

గూడూరు, మార్చి 17 : పాకాల సరస్సు నుంచి వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు మాలోతు కవిత కోరారు. గూడూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి ఆదివారం ఓ శుభకార్యానికి హాజరైన ఎంపీ కవితకు రైతులు తమ పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎంపీ కవిత ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సమస్య వివరించి పరిష్కరించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కవిత తెలిపారు.

టేకులతండాలో గుడుంబా తయారీ

డోర్నకల్, మార్చి 17 : మండలంలోని గుర్రాలకుంట గ్రామపంచాయతీ శివారు టేకులతండాలో విచ్చలవిడగా గుడుంబా తయారు చేస్తూ విక్రయిస్తున్నారని తండాకు చెందిన కొందరు యువకులు, మహిళలు తెలిపారు. గుడుంబా తయారీలో భారీగా పంచదారతో తయారు చేయడం ద్వారా దానిని సేవించిన వారు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎక్సైజ్, పోలీస్, ప్రజాప్రతినిధులు తమ గ్రామంలో గుడుంబా తయారీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

దంతాలపల్లి సెంటర్‌కు 308 మంది విద్యార్థులు

దంతాలపల్లి, మార్చి 17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ సెంటర్‌లో 308 మంది పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై కరుణాకర్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు అమలులో ఉంది. మండలంలోని దాట్ల, పెద్దముప్పారం, రేపోణి, కుమ్మరికుంట్ల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దంతాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు సెంటర్లను కేటాయించారు. కాగా, పరీక్ష కేంద్రం శివారు 100 మీటర్ల దూరంలో, రోడ్లపై గుంపుగుంపులుగా ఎవరు ఉండకూడదని ఎస్సై కరుణాకర్ హెచ్చరించారు.


పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి హాజరైన 1991-92 టెన్త్‌బ్యాచ్

గూడూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గూడూరు, మార్చి17 : గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-92 పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. గూడూరు మండలం మర్రిమిట్ట శివారు తేట దస్రుతండ శివారులో ఉన్న మామిడి తోటలో పూర్వ విద్యార్థులు అంతా ఒకచోట కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ స్థాయిల్లో స్థిరపడ్డ వారు ఆర్థికంగా చితికిపోయిన తమ మిత్రులను ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాగ మల్లేశ్వర్‌రావు, లక్ష్మణ్, వీరస్వామి, పాపయ్య, బత్తుల లక్ష్మణ్, తెల్లబోయిన లక్ష్మణ్, యాకాంబ్రం, సాయిరెడ్డి, అంజనేయులు, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భద్రునాయక్, నూకల ఉపేందర్, సాంబయ్య, మేడి మల్లేష్, శ్రీశైలం, రహెమత్‌బాబా, మండల శ్రీను, వెంకటేశ్వర్లు, జ్యోతి, సుజాత, వసంత పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దండోరా పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఎల్లయ్య



నెహ్రూసెంటర్, మార్చి17 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మా ర్పీఎస్) దండోరా మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొండ్ర ఎల్లయ్యను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, జాతీయ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్ ఆదివారం ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కొండ్ర ఎల్లయ్య దళితుల సంక్షేమం కోసం అహర్నిశలుగా శ్రమిస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. ఆయన సేవలను గుర్తించి మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు ఎల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మహదేవపూర్, మార్చి 17 : మండలంలోని కాళేశ్వరంలో మతి స్థిమితం లేకుండా ఉన్న వృద్ధుడు తప్పిపోగా అతడి ఆచూకీని పోలీసులు 24 గంటల్లోనే కనుగొన్నారు. అనంతరం అతడిని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన కార్ల వెంకన్న (72) కాళేశ్వరానికి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వచ్చాడు. ఈ క్రమంలో అతడు తప్పిపోయాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆదివారం అతడి ఆచూకీ కనుగొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు కాళేశ్వరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పాలకుర్తి(జనగామ జిల్లా), మార్చి 17 : ఆర్థిక ఇబ్బందులతో గాదరి సంజీవ(34) అనే రైతు ఆత్మహత్య చేసుకు న్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోతులబాదు గ్రామానికి చెందిన సంజీవ అప్పులు తెచ్చి ఇంటిని నిర్మించాడు. అయితే పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు తీరే మార్గంలేక మనస్తాపంతో ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందుతాగి చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాయిప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.